క్లుప్తంగా

పారదర్శకంగా కులగణన సర్వే



కొండెవరంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా కులగణన సర్వే పారదర్శకంగా జరుగుతోందని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండలంలోని కొండెవరంలో జరుగుతున్న కులగణన సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకూ సర్వే నిర్వహిస్తారన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి, వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇళ్ల వద్ద లేని వారికి ఆయా గ్రామ సచివాలయాల్లో ఫిబ్రవరి 5వ తేదీ వరకూ నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సర్వేకు ప్రజలు, అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముసలయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ పోషణను సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు పౌష్టికాహారం అందజేసిన కౌన్సిలర్

సామర్లకోట: గర్భిణులు, బాలింతలు వైఎస్సార్ పోషణను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు అన్నారు. స్థానిక 14వ వార్డు, 29వ అంగన్‌వాడీ సెంటర్ నుంచి గర్భిణులు, బాలింతలకు డిసెంబర్, జనవరి నెలలకు అందాల్సిన పౌష్టికాహారాన్ని బుధవారం ఆయన పంపిణీ చేశారు.

ద్వితీయ ఉత్తమ నాటికగా 'కబ్జా'



కబ్జా నాటికలో ఓ సన్నివేశం

సామర్లకోట: ఒడిషా రాష్ట్రంలోని భిలాయ్‌లో రెండు రోజుల పాటు జరిగిన నాటిక పోటీల్లో సామర్లకోటకు చెందిన శృంగార వల్లభ ఆర్ట్స్ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన 'కబ్జా' ద్వితీయ ఉత్తమ నాటికగా ఎంపికైంది. ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో డీవీ సత్యనారాయణ స్మారక నాటిక పోటీలు జరిగాయి. ఈ మేరకు బుధవారం సాయంత్రం సామర్లకోట సకల కళా సమాఖ్య గౌరవాధ్యక్షుడు, సినీ దర్శకుడు, రచయిత కేబీ ఆనంద్ స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. కబ్జా నాటికకు ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ద్వితీయ రచన, ద్వితీయ దర్శకత్వంలో బహుమతులు వచ్చాయని తెలిపారు. సమాఖ్య ప్రతినిధులు బడుగు సీతారామరాజు, కేతినీడి శ్రీనివాసరావులు ఆనంద్‌ను అభినందించారు.

హ్యాండ్ వాష్ యూనిట్ ప్రారంభం

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రతిఒక్కరూ హ్యాండ్ వాష్ యూనిట్‌ను వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కమిషనర్ జె రామారావు, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పిఠాపురం: గ్రామాల్లో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు ఎస్సై బాలాజీ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బుధవారం రాత్రి నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో అందరూ శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జోగారావుకు నివాళులు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ప్రధానార్చకులుగా పని చేస్తూ, ఇటీవల మృతి చెందిన కొంతేటి జోగారావుకు బుధవారం పలువురు నివాళులర్పించారు. సుమారు 35 ఏళ్ల పాటు ఆలయంలో విశేష సేవలందించిన జోగారావు మృతికి పారిశ్రామిక వేత్తలు పసల పద్మరాఘవరావు, బిక్కిన సాయి, ఆర్వీ సుబ్బరాజు, గంజి బూరయ్య, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, రైతు సంఘ నాయకుడు కంటే బాబు, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం, దీపారాధన సంఘ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

మంచి సమాజానికి కళలు దోహదం

- రాష్ట్ర స్థాయి నాటక కళా పరిషత్ పోటీల ప్రారంభోత్సవంలో వక్తలు



నాటక కళా పరిషత్‌ను ప్రారంభిస్తున్న వీర్రాజు, నారాయణమూర్తి

పెద్దాపురం: కళలు, అందులోనూ నాటకాలు మంచి సమాజం నిర్మించడానికి దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహా ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పంచమ నాటక కళా పరిషత్ పోటీలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. సంస్థ అధ్యక్షుడు గొందేశి రాజా అధ్యక్షతన ప్రారంభోత్సవ సభ జరిగింది. సభలో డీఎస్పీ లతా కుమారి, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, పులిమేరు సొసైటీ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి తదితరులు మాట్లాడారు. మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాలు వ్యక్త పరిచాయన్నారు. సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు, ప్రముఖ పీఎంపీ వైద్యులు చిర్రావూరి గంగారావు మాట్లాడుతూ నాటకాలను బతికించుకుంటూ, మంచి సమాజానికి బాటలు వేయాలన్నారు. తొలుత వక్తలు జ్యోతి ప్రజ్వలన చేసి, యిందన నర్సారావు, సినీ నటులు కైకాల సత్యనారాయణ కళా ప్రాంగణాన్ని ప్రారంభించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కళాకారులకు డీఎస్పీ లతాకుమారి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా బోరివంక శార్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కొత్త పరిమళం, విశాఖపట్నం తెలుగు కళా సమితి వారి నిశబ్దమా నీ ఖరీదెంత నాటికలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, గోగులపాటి రాంబాబు, రాధాకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ, కొమ్మిరెడ్డి బుజ్జి, ఇందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, వెన్నా పండు, మానేపల్లి రవీంద్ర, గొందేశి సత్యానందం, వెన్నా సత్యనారాయణ, మాగాపు నాగేశ్వరరావు, కంటిబోయిన నాగేశ్వరరావు, సూకలమంతి నానాజీ, పాలాని సత్తిబాబు, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్, కేదారి నాగేశ్వరావు, కర్రి స్వామి, మాగాపు నాగు, ప్రజా నాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

సందేశాత్మకం.. కొత్త పరిమళం

మొదటి నాటికగా శ్రీకాకుళం జిల్లా బోరివంక శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారి, కె.శ్రీనివాసరావు రచన, బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో కొత్త పరిమళం నాటికను ప్రదర్శించారు. ఇండియా-పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో మూడో ప్రపంచ యుద్ధంతో ప్రజలు క్షణ క్షణం వణుకుతూ, నరకయాతన పడుతూ, బతుకీడుస్తున్న కాలం అది. ఒకవైపు మంచు కొండలా పెరిగిపోతుంది. మరోవైపు మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి, జాతి, మత ద్వేషాలతో దేశాలు రగిలిపోతున్నాయి. వాటి మధ్య నలిగిపోయిన సరిహద్దు జీవిత గాథను మొదటి ప్రదర్శనగా ప్రేక్షకుల ముందుంచారు. ప్రపంచంలో మనుషులందరూ మంచివారే. కానీ, కాలమాన పరిస్థితులే మంచివి కావు. మనుషుల్లో విద్వేషాన్ని రగలిస్తూ, చివరకు అనర్థమే మిగిలిస్తుంది. జాతి, మత విద్వేషాన్ని అంతచేసి, సరిహద్దులు లేని అందమైన ప్రపంచాన్ని భావితరాలకు అందాలనే సందేశంతో ఈ నాటిక ముగుస్తుంది.



కొత్త పరిమళం నాటికలోని సన్నివేశం

రెండో ప్రదర్శనగా.. నిశబ్దమా నీ ఖరీదెంత?

అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగుపరుద్దామని చట్టంలోని కొన్ని మార్పులు చేస్తున్నారు. అవి నిజంగా కష్టాలను, కన్నీళ్లను అనుభవిస్తున్న వాళ్లకు ఎంతవరకు ఉపయోగపడుతాయో తెలీదు. కొంతమంది తప్పుడు రిపోర్టుల కారణంగా, చట్టం దుర్వినియోగం అవుతోంది. దీని వల్ల ఎన్నో కుటుంబాలు మానసికంగా కృంగిపోతున్నాయి, నలిగిపోతున్నాయంటూ తెలిపేది విశాఖపట్నం తెలుగు కళా సమితి వారు ప్రదర్శించిన నాటిక నిశబ్దమా నీ ఖరీదెంత?. ఇటీవల ఉన్నత న్యాయస్థానం కారణాలేమైనా.. అక్రమ సంబంధం నేరం కాదనే చట్ట ప్రకారంగా ఎవరినీ శిక్షించేది లేదని ఐపీసీ నుంచి 497 సెక్షన్ తొలగించింది. దీంతో కళ్లెదుటే అక్రమ సంబంధం ఏర్పర్చుకుంటే, శిక్షించలేని నిస్సహాయత ఏర్పడింది. అయితే ఈ కారణంగా విడాకులు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించింది. మరి నైతిక విలువలు ఏంటి, వివాహ వ్యవస్థ పవిత్రత మాటేమిటి, మరీ ఈ అక్రమ సంబంధాల ఘర్షణలో నలిగిపోతున్న పిల్లల భవిష్యత్తు ఏంటి.. అంటూ ప్రశ్నిస్తూ కళాకారులు ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఇక్కడ మేధావుల నిశబ్దం.. జాతికే ప్రమాదం అంటూ నాటిక ముగిసింది.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ



శిబిరంలో కిట్లు అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక ఒకటో వార్డు బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి, వైద్య శిబిరాలకు వచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. డాక్టర్లు వై.యశ్విని, ఎం రఘువంశీ, రమ్యప్రీతి, సీహెచ్ భవ్యశ్రీ రోగులను పరీక్షించి, మందులను అందజేశారు. చైర్‌పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, డాక్టర్లు రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జె రామారావు, వార్డు కౌన్సిలరు రెడ్డి లోవకుమారి, డాక్టరు వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పిఠాపురంలో క్రీడలను ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

పిఠాపురం: క్రీడాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురం ఆర్‌ఆర్ బీహెచ్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక క్రీడాకారులకు అనేక సదుపాయాలు కల్పించారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పలు క్రీడల్లో రాష్ట్రానికి పతకాలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా బాలికలు క్రీడలపై మక్కువ పెంచుకునేలా చర్యలు తీసుకున్నారన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చిన ప్రాధాన్యం గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదన్నారు. విద్య, వైద్య, క్రీడా రంగాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బొజ్జా దొరబాబు, జవ్వాది నాయుడు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, పలువురు క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దొరబాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: ప్రతిఒక్కరిలో ప్రతిభను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం స్థానిక లూథరన్ హైస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. దొరబాబు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పట్టణ, గ్రామీణ యువత క్రీడల్లో పాల్గొని, రాష్ట్ర స్థాయిలో పెద్దాపురం నియోజకవర్గానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, పెంటకోట సత్తిబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయ చైర్మన్ కర్రి రామజగదీశ్వరరావు, సామర్లకోట ఎంపీడీఓ శ్రీలలిత, పెద్దాపురం తహసీల్దార్ జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎంఈఓలు శర్మ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన కర్రి గోవిందు సారా తరలిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్సై స్వామి నాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆదాయ వనరులపై మరీ ఇలా ?

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ధ్వజం
- 2024–25కు రూ.7.20 కోట్ల మిగులు బడ్జెట్ ఆమోదం



అధికారుల తీరును ప్రశ్నిస్తున్న అధికార పక్ష కౌన్సిలర్లు



సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: మున్సిపల్ అధికారులు ఆదాయ వనరులపై దృష్టి సారించడం లేదని అధికారపక్ష కౌన్సిలర్లు ఆరోపించారు. బుధవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరిగింది. బడ్జెట్‌లో చెరువులపై కేవలం రూ.75 వేలు మాత్రమే ఆదాయం చూపడం వింతగా ఉందని నేతల హరిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. నాగార్జున చెరువుకు రూ.4.50 లక్షలు చెల్లించారని, అది ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. పట్టణంలో అనేక సెల్ టవర్లు, ప్రకటన బోర్డులుండగా, బడ్జెట్‌లో నామమాత్రంగా ఆదాయం చూపారని పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు ఆరోపించారు. దీనిపై కమిషనర్ జె.రామారావు స్పందిస్తూ, పట్టణంలోని ప్రతి బోర్డుకు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీల ద్వారా లిస్టు తయారు చేయించి, పన్నులు వేయాలని సూచించారు. షాపుల బోర్డులకు పన్నులు వేస్తూ, రోడ్లపై విచ్చలవిడిగా ఉన్న ప్రకటనలకు పన్నులు వేయడం లేదని కరణం రాజ్‌కుమార్ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులుండేవని, దానిని ప్రస్తుతం బడ్జెట్‌లో చేర్చడం వింతగా ఉందని హరిబాబు పేర్కొన్నారు. అంచనా బడ్జెట్‌లో అన్ని రకాల ఆదాయాలను చూపుతామని అకౌంటెంట్ అనిల్‌కుమార్ తెలిపారు. మెప్మా భవనానికి నిధులు కేటాయించినట్టుగానే, అంబేడ్కర్ భవనానికీ నిధులు కేటాయించాలని హరిబాబు సూచించారు. సమావేశం ప్రారంభానికి ముందుగా కరణం రాజ్‌కుమార్, పితాని కృష్ణ జీరో అవర్ కావాలని కోరారు. బడ్జెట్ సమావేశంతో పాటు, సాధారణ, అత్యవసర సమావేశాలున్న కారణంగా జీరో అవర్ సాధ్యం కాదని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. సభ్యుల సమస్యలను తన చాంబర్‌లో చర్చించాలని సూచించారు. అనంతరం సాధారణ, అత్యవసర సమావేశంలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

మున్సిపాలిటీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7,20,85,555తో మిగులు బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు రూ.9,57,15,566ను ప్రారంభ నిల్వగాను, ఆదాయం రూ.27,06,24,988 గాను, రూ.29.42,55,000 వ్యయంగా చూపారు.

పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో కౌన్సిల్ బడ్జెట్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: పిఠాపురం మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు విడుదల చేయించి, మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత హామీ ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపీ గీత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాను పార్లమెంటు సభ్యురాలిగా స్థానిక సంస్థల సమావేశాల్లో పాల్గొనవచ్చని, అందుకే ఈ సమావేశానికి వచ్చానని టీడీపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. పిఠాపురం పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరి మాట్లాడుతూ జగ్గయ్యచెరువు కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన చేస్తున్నారని, పలు వార్డుల్లో పనులు పూర్తయినా బిల్లులు రాకపోవడంతో పలువురు సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరిగింది. పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుద్ధ్య సమస్య పెరుగుతోందని, వీధిలైట్లు, డ్రైన్లు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు సభ్యులు గళమెత్తారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. అనంతరం 2023–24 అంచన బడ్జెట్ రూ.40.20 కోట్లు కాగా, ఖర్చు రూ.32.54 కోట్లుగా, ముగింపు నిల్వ రూ.29.75 కోట్లుతో సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి దొరబాబు పరామర్శ



రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొరబాబు

సామర్లకోట: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన శానిటరీ వర్కరు మిరియాల రాజు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం సాయంత్రం పరామర్శించారు, అతడి చిత్రపటానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఉన్నారు. పట్టణంలో పలువురి కుటుంబాల పరామర్శల్లో దొరబాబు పాల్గొన్నారు.

బాలికలకు విద్యే ప్రధానం



గొల్లప్రోలులో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రస్తుత సమాజంలో బాలికలకు విద్యే అత్యంత ప్రధానమని బాలికా,శిశు సంరక్షణ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేజే ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలు నడవడిక, ఆరోగ్య సూత్రాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరైనా బాలికలను తాకరాని చోట తాకితే వెంటనే కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, ఇంచార్జి ఐసీడీఎస్ సీడీపీఓ నిహారిక, సెక్టార్ సూపర్ వైజర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

పిఠాపురం: గొల్లప్రోలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలికలకు పలు పోటీలు నిర్వహించారు. పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి నిహారిక, ఎంఈఓలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు కె.మానసాదేవి, వి.నాగమణి, కృష్ణవేణి, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.